## నేడు,రేపు చార్మినార్ సర్కిల్ అటవీ శాఖ క్రీడా పోటీలు

సుభాష్‌నగర్: అటవీ శాఖ చార్మినార్ సర్కిల్ ప్రాంతీయ క్రీడా పోటీలు ఈ నెల 10, 11 తేదీల్లో దూలపల్లిలోని తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీలో జరుగనున్నాయి. పరుగు పందెం, నడకపోటీ, వెయిట్ లిఫ్టింగ్, షటిల్, క్యారమ్స్, చెస్, లాన్‌టెన్నిస్, టేబుల్ టెన్నిస్, రైఫిల్ షూటింగ్, ఆర్చరీ, వాలీబాల్, బాస్కెట్ బాల్, కబడ్డీ, హాకీ, టగ్ ఆఫ్ వార్, సైక్లింగ్, మారథాన్ తదితర పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలను రాష్ట్ర అటవీ ముఖ్య ప్రధాన సంరక్షణాధికారి డాక్టర్ సి.సువర్ణ, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ ఎలుసింగ్ మేరు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించనున్నారు.

## గుంతల రోడ్లకు మరమ్మతులు చేయాలి

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుంతల రోడ్లకు మరమ్మతులు చేయాలని బీజేపీ బాచుపల్లి ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్ అన్నారు. గురువారం మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రగతి నగర్ నుంచి 21వ వార్డు, శ్రీ సాయి నగర్ కాలనీకి వెళ్లే రోడ్లు ప్రమాదకరంగా మారిందన్నారు. రాత్రి వేళల్లో మరింత ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు

జగద్గిరిగుట్ట: వంట చేస్తుండగా అకస్మాత్తుగా గ్యాస్ లీకవ్వడంతో మంటలు వ్యాపించాయి. ఈ ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. డీఐ నరేందర్ రెడ్డి వివరాల ప్రకారం .. ఉషోదయ కాలనీలోని వినాయక రెసిడెన్సీలో ప్రశాంత్, సునీత దంపతులు నివసిస్తున్నారు. సునీత బుధవారం సాయంత్రం వంట చేస్తుండగా గ్యాస్ లీకైంది. వెంటనే గమనించి ఇంట్లో ఉన్నవారు, అపార్ట్‌మెంట్ వాసులు బయటకు పరుగెత్తారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకొని అపార్ట్‌మెంట్ యొక్క ప్రధాన విద్యుత్ సరఫరాను నిలిపి వేసి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రతి శనివారం ఉచిత రెటినోపతి పరీక్షలు

బాలానగర్: బాలానగర్‌లోని లయన్స్ కంటి హాస్పిటల్‌లో ప్రతి శనివారం ఉచిత దయాబెటిక్, రెటినోపతి స్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ ప్రతినిధి జంపాల రాకేష్ గురువారం తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## వాటర్‌వర్క్స్ ఎండీకి వినతి

ఓల్డ్ బోయిన్‌పల్లి: డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని నాయకులు కోరారు. ఈ మేరకు ఎంపీ ఈటల రాజేందర్ ఇచ్చిన అభివృద్ధి పనుల ప్రతిపాదనతో కూడిన లెటర్, కాలనీవాసుల వినతిపత్రంను వాటర్ వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డికి గురువారం అందజేశారు. నిధులు మంజూరుకు ఎండీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎనుగుల తిరుపతియాదవ్, సత్యమూర్తి, కాసు అశోక్, రమేష్, అరుణ్, రాజు, మల్లేష్, బాలరాజు పాల్గొన్నారు.


కాలిబూడిదైన చెత్త


శ్రీపతి కెమికల్స్ రోడ్డులో పారబోసిన చెత్త

# పారిశ్రామికవాడ రోడ్లపై చెత్త డంపింగ్!

### చెత్తలో రాత్రి వేళ పరిశ్రమల వ్యర్థాలు

జీడిమెట్ల: జీడిమెట్ల పారిశ్రామికవాడ, ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీలో రోడ్లపై చెత్త డంపింగ్ ఐలా మున్సిపల్ సిబ్బందికి తలనొప్పిగా మారింది. పారిశ్రామిక ప్రాంతంలోని పలు పరిశ్రమల నుంచి కొంతమంది రాత్రివేళల్లో పరిశ్రమల్లో వెలువడిన వ్యర్థాలను రోడ్లపై డంప్ చేస్తున్నారు. చెత్త ఎక్కువగా రోడ్ల పక్కన డంప్ చేస్తుండటంతో చెత్త నుంచి తీవ్రమైన దుర్వాసన వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా కొంతమంది చెత్తను రోడ్ల పక్కన డంప్‌చేసి నిప్పంటిస్తున్నారు. దీంతో విపరీతమైన పొగలు వెలువడుతున్నాయి. ఉదయం పూట పరిశ్రమలకు కాలినడకన వెళ్లే వారు పొగలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఐలాలో మున్సిపల్ సిబ్బంది తక్కువగా ఉన్నారు. ఇప్పటికైనా చెత్త డంపింగ్ చేసే ప్రాంతాల్లో అధికారులు సీసీ కెమరాలను ఏర్పాటు చేయాలని, చెత్త డంపింగ్ చేసే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీలో పారబోసిన చెత్త

## ఎట్టకేలకు నూతన స్తంభం ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

కుత్బుల్లాపూర్: షాపూర్‌నగర్ సెక్షన్ పరిధిలోని ఎస్ఆర్ నాయక్ నగర్ అపురూప కాలనీ ఫీడర్‌లో ప్రమాదకరంగా ఉన్న స్తంభాన్ని గురువారం తొలగించారు. దాని స్థానంలో కొత్త స్తంభం ఏర్పాటు చేసినట్లు షాపూర్ నగర్ ఏడీఈ వీరేశ లింగం తెలిపారు. ఈనెల 5న 'సాక్షి'లో 'ప్రణాళికలు ఒక విధంగా.. పనులు మరో విధంగా' శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. క్షేత్రస్థాయిలో పరిశీలించి విద్యుత్ పోల్స్ నాసిరకంగా ఉన్న వాటిని మార్చినట్లు అధికారులు తెలిపారు. కిందిస్థాయి సిబ్బంది అక్రమాలకు పాల్పడితే తమకు ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు.


స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

## ఎక్కడికక్కడ బీఆర్ఎస్ నాయకుల అరెస్టు


ఎమ్మెల్యే వివేకానంద్‌ను హౌస్ అరెస్ట్ చేస్తున్న పోలీసులు

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ తలపెట్టిన చలో బస్ భవన్ కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి తరలివెళ్తున్న బీఆర్ఎస్ ముఖ్య నాయకులను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే వివేకానంద్‌ను, శంభీపూర్ గ్రామంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులను హౌస్ అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకులను ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకుని స్టేషన్లకు తరలించారు. సాయంత్రం సొంత పూచికత్తుపై విడుదల చేశారు. అనంతరం వివేకానంద్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తుందన్నారు. ఇది ప్రజా పాలన కాదని, ప్రజా కంటక పాలన అని ఎద్దేవా చేశారు. పోలీసులుతో ప్రతి పక్ష నాయకులను అడ్డుకోవచ్చ గానీ ప్రజల్లోని ఆవేశాన్ని ఆపలేరన్నారు. మహిళలకు బస్సు ఉచిత ప్రయాణం అంటూనే మరో పక్క బస్సు చార్జీలను పెంచడం సిగ్గుచేటన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు.


ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

## పోలీసుల అదుపులో తప్పిపోయిన బాలుడు


పోలీసుల వద్ద ఉన్న బాలుడు

నిజాంపేట్: నిజాంపేట్ పెట్రోల్ పంప్ వద్ద 4సంవత్సరాల బాలుడు తప్పిపోయి తచ్చాడుతూ బాచుపల్లి పెట్రోలింగ్ పోలీసులకు గురువారం కనిపించాడు. ఆ బాలుడిని పోలీసులు తీసుకున్నారు. పూర్తి వివరాల కోసం అడుగగా.. ఆ బాలుడు చెప్పలేకపోతున్నాడు. దీంతో ఆ బాలుడిని బాచుపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించి సంరక్షించారు. బాలుడి వివరాలు తెలిసినవారు బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని, ఎస్సై రాజశేఖర్‌రెడ్డి ఫోన్ నెంబర్ 8712568334లో సంప్రదించి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించడంలో సహకరించాలని బాచుపల్లి పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## నడిరోడ్డుపై గుంత.. వాహనదారులకు చింత!



రంగారెడ్డినగర్: ప్రధాన రహదారులపై ఉన్న గుంతలను పూడ్చడంలో అధికారుల నిర్లక్ష్యం వాహనదారులకు ప్రాణ సంకటంగా మారుతోంది. బాలానగర్– నర్సాపూర్ రాష్ట్ర రహదారిలోని ఐడీపీఎల్ సిగ్నల్స్ సమీపంలోని యూటర్న్ వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో గుంతలో నీళ్లు చేరాయి. నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రోడ్డులో గుంతను గుర్తించక వాహనదారులు అందులో పడి గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా సర్కిల్ అధికారులు స్పందించి వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా గుంతను శాశ్వత ప్రాతిపదికన పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

## యువత రాజ్యాంగం గురించి తెలుసుకోవాలి

### ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి సూచన

దుండిగల్: నేటి సమాజంలో ప్రశ్నించడమనేది చాలా ముఖ్యమని, యువత భారత రాజ్యాంగం గురించి పూర్తిగా తెలుసుకుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి అన్నారు. దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో 'ఎంపవరింగ్ యూత్ ఆన్ ఆర్టీఐ యాక్ట్– 2005'పై గురువారం సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బాలకిష్టారెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన ఆర్టీఐ చట్టం దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, యువత ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్‌రావు, ఎన్ఎస్ఎస్ మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ ఎస్.రవితేజ, డీన్ డాక్టర్ వి.రాధికాదేవి, వివిధ విభాగాల అధిపతులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాయిని ఉదయ్ రంజన్‌గౌడ్ పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల బస్తీబాట

### సెంట్రల్ పార్క్ జయభేరి కాలనీలో మరమ్మతులు

కుత్బుల్లాపూర్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులు బస్తీబాట పట్టారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సెంట్రల్ పార్క్, జయభేరి కాలనీ ప్రాంతాల్లో లో వోల్టేజ్ సమస్య, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, కేబుల్ లైన్ మార్చడం వంటి పనులను గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సిబ్బందితో పనిచేసి సమస్యను పరిష్కరించారు. మేడ్చల్ డీఈ జాన్ రాజ్, కుత్బుల్లాపూర్ ఏడీఈ శ్రీకాంత్, కొంపల్లి ఏఈ శ్రీనివాసులు స్థానిక సంక్షేమ సంఘాలతో కలిసి విద్యుత్ సమస్యలు తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో లక్ష్మీగణపతి అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, కాలనీవాసులు గణేష్, శంకర్ గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, భాష, రాఘవేంద్ర రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

## బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

### బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్



కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో జీవో నెం.9 ను శాస్త్రీయ పద్ధతిలో కాకుండా తమకు ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరించడం వల్లే హైకోర్టు స్టే ఇచ్చిందని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో ప్రభుత్వ విధానం శాస్త్రీయంగా, సరిగ్గా లేదని బీఆర్ఎస్ పార్టీ తరపున అసెంబ్లీ వేదికగా ప్రభుత్వానికి హితవు పలికామని గుర్తు చేశారు. రేవంత్ సర్కార్ మాత్రం తమ సలహాలను, సూచనలను పెడచెవిన పెట్టడం వల్లే నేడు హైకోర్టులో స్టే విధించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బీసీ రిజర్వేషన్లపై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామని చెప్పిన రేవంత్ సర్కార్ మాటతప్పి ఢిల్లీకి పోయి ధర్నాల పేరుతో నాటకాలు ఆడారని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ వేదికగా చేయాల్సిన పోరాటాలను గల్లీలో చేస్తూ బీసీలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ విషయంలో అఖిలపక్షం సభ్యుల సూచనలను, సలహాలను స్వీకరించాలన్నారు.

## అధికారుల వైఖరి సరికాదు

కుత్బుల్లాపూర్: అధికారులు అధికార పార్టీ నాయకులకు తలొగ్గుతున్నారని కొంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మున్సిపల్ కమిషనర్ కలిసి పలు విషయాలపై మాట్లాడారు. ఇటీవల మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అభివృద్ధి కార్యక్రమాలకు ఏ అర్హతతో శంకుస్థాపన చేస్తున్నారని నిలదీశారు. ఏ అర్హత లేని వ్యక్తి అభివృద్ధి పనులను ప్రారంభిస్తుంటే అధికారులు ఎందుకు అడ్డుకోవడం లేదన్నారు. అధికారం ఉంది కదా అని విర్రవీగితే ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అధికారుల తీరు మార్చుకోవాలన్నారు.


కమిషనర్‌తో మాట్లాడుతున్న సన్న శ్రీశైలం యాదవ్

## రాష్ట్ర డిప్యూటీ ఈఎన్‌సీని కలిసిన మాజీ ఎమ్మెల్యే


అధికారులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనుల విషయమై గురువారం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ రాష్ట్ర డిప్యూటీ ఈఎన్‌సీ నర్సింహా రెడ్డి, ఎస్ఈ వెంకటేశ్వర్‌ను కలిశారు. కొంపల్లిలోని ఊర చెరువు సుందరీకరణ, దూలపల్లి ఎన్‌టీఆర్ విగ్రహం నుంచి ఇండస్ట్రియల్ ఏరియా వరకు సరైన రోడ్డు మార్గం లేక గుంతలు ఉండటం వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సానుకూలంగా స్పందించి అధికారులు తక్షణమే నిధులు మంజూరు చేసి అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకుడు జెమ్మి దేవేందర్ తదితరులు ఉన్నారు.

## ఉప కమిషనర్ మల్లారెడ్డికి ఆర్టీఐ ప్రశంసాపత్రం


గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న మల్లారెడ్డి

కుత్బుల్లాపూర్: తెలంగాణ ఇన్ఫర్మేషన్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్టీఐ వీక్ సెలబ్రేషన్స్‌లో గాజులరామారం ఉప కమిషనర్ మల్లారెడ్డి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. సమాచార హక్కు చట్టం కింద వచ్చిన దరఖాస్తులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ సమాచారం అందించిన గాజులరామారం ఉప కమిషనర్ మల్లారెడ్డికి రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, హైకోర్టు జడ్జి శ్యామ్ కోసీలు ప్రశంస పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంల ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణరావు, ఐపీఎస్ సీవీ ఆనంద్, తెలంగాణ రాష్ట్ర చీఫ్ ఫారెస్ట్ కన్సర్వేటర్ సి.సువర్ణ పాల్గొన్నారు.

# జాప్యమెందుకో?

- ప్రజావాణి ఫిర్యాదులకు పరిష్కారం అంతంతే
- అక్రమ నిర్మాణాలపై సమాచారం ఇవ్వడంలోనూ నిర్లక్ష్యం


ప్రజావాణిలో ఫిర్యాదు స్వీకరిస్తున్న డీసీ నరసింహ(ఫైల్)

కుత్బుల్లాపూర్: జీహెచ్ఎంసీ వ్యాప్తంగా ఉన్న 30 సర్కిళ్ల పరిధిలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ కమిషనర్‌లకు, టౌన్ ప్లానింగ్ అధికారులకు, జోనల్ ఎస్‌టీఎఫ్ అధికారులకు హైకోర్టు ఆదేశాల మేరకు గ్రేటర్ కమిషనర్ సర్క్యులర్ జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించి చేపడుతున్న అక్రమ నిర్మాణాలను సీజ్ చేయాలని ఆ సర్క్యులర్ యొక్క సారాంశం. హైకోర్టు ఆదేశాల అనుసారం జారీ చేసిన ఈ సర్క్యులర్‌ను కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల అధికారులు ఏమాత్రం అమలు చేయడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాల పట్ల ఉదారంగ వ్యవహరిస్తు సమాచార హక్కు చట్టం ద్వారా చేసుకున్న దరఖాస్తులకు చుక్కలు చూపిస్తున్నారు. కోర్టులో పలానా విధంగా ఆదేశాలు ఉన్నాయని.. ఇవ్వడానికి కుదరదని.. ఇలా అనేక కారణాలు చెప్పి విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. చివరకు 'ప్రజావాణి'లో వచ్చే ఫిర్యాదులు సైతం వీరికి కాసులు కురిపిస్తున్నాయి.

### సిబ్బంది వివరాల్లో సైతం ...

ఇటీవల పలు సందర్భాలలో గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల కార్యాలయంలో ఆర్టీఐ సెక్షన్ 4(1)(బీ) వివరాల కోసం, అదేవిధంగా టౌన్ ప్లాన్ విభాగంలో పనిచేస్తున్న ఉన్నతాధికారి మొదలుకొని అటెండర్ వరకు పనిచేస్తున్న వారి వివరాల తెలపాలని సమాచార హక్కు చట్టం దరఖాస్తు చేశారు. దీనికి బదులుగా పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, ఉప కమిషనర్లు ఆయా వివరాలను ఇవ్వడానికి నిరాకరించారు. ఆయా వివరాలు సెక్షన్ 8 (1) (జె) పరిధిలోకి వస్తుందని పేర్కొంటూ పలానా అంశంలో ఈ వివరాలను తెలియజేయడానికి వీలులేదని తెలిపే కేసులు వివరాలను పేర్కొంటూ సమాచారం ఇవ్వలేదు. వాస్తవంగా ఆర్టీఐ సెక్షన్ 4(1)(బీ) లో పొందుపర్చాల్సిన 17 అంశాలలో ఒక అంశం ఆయా ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది, వారి యొక్క జీతభత్యాల వివరాలను తెలియజేయాలి. కానీ ఆ విధంగా కాకుండా గోప్యత ఎందుకు పాటిస్తున్నారో అధికారులకే తెలియాలి.


### ప్రైవేటు వ్యక్తులదే హవా..!

కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల టౌన్ ప్లానింగ్ విభాగం, అదే విధంగా రెవెన్యూ విభాగంలో సంబంధంలేని వ్యక్తులు హవా నడిపిస్తున్నారు. అధికారులకు అందిన కాడికి వసూళ్లు చేసి ఇస్తున్నారు అన్నది ప్రధాన ఆరోపణ. అటు జీహెచ్ఎంసీ ఎంప్లాయ్ కాకుండా, ఔట్ సోర్సింగ్ సిబ్బంది కాకుండా రెండు సర్కిళ్ల పరిధిలో ప్రైవేట్ వ్యక్తులు ఆయా విభాగాలలో సిబ్బందిగా చెప్పుకుంటూ అక్రమ నిర్మాణాల వద్ద వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. సమాచార హక్కు చట్టం ద్వారా సిబ్బంది వివరాలను తెలియజేస్తే అంతర్గతంగా జరుగుతున్న ప్రైవేటు వ్యవహారాలు బయటపడతాయి అనే ఉద్దేశంతోనే సమాచార హక్కు చట్టం దరఖాస్తులను తిరస్కరిస్తున్నారని పలువురు దరఖాస్తుదారులు వాపోతున్నారు.

### ఫిర్యాదులపై దృష్టి సారించరా?

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులపై అధికారులు ఏ మాత్రం స్పందించడం లేదని పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కేవలం మొక్కుబడిగా కార్యక్రమం నిర్వహించి వెళ్తున్నారు తప్ప.. వచ్చిన ఫిర్యాదులపై దృష్టి సారించడం లేదన్న విమర్శ ఉంది. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగంపై వచ్చే ఫిర్యాదులపై జంట సర్కిళ్ల పరిధిలో అధికారులు ఏర్పాటు చేసుకున్న ప్రైవేట్ సైన్యం రంగంలోకి దిగి బేరసారాలు చేస్తూ.. అందిన కాడికి దండుకుంటున్నారు. దీంతో ఫిర్యాదుదారులు ప్రతి వారం వచ్చి.. అధికారులతో గొడవ చేసి వెళ్తున్నారే తప్ప వారి సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదు. ఇలా రెవెన్యూ విభాగంలో పనిచేసే ప్రైవేటు వ్యక్తుల సైతం ఇంటి నెంబర్లు కేటాయించే విషయంలో తమదైన చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు ఉన్నప్పటికీ వీరిదే హవాగా మారింది. దీంతో ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులు అధికారులకు కాసులు కురిపిస్తున్నాయని చెప్పుకోవచ్చు.

## కొండను పిండి చేసి.. బహుళఅంతస్తుల నిర్మాణాలు!



జగద్గిరిగుట్ట: కొండను పిండి చేసి ఆ స్థలాన్ని ఆక్రమించి 2 నుంచి 3 అంతస్తుల నిర్మాణం చేస్తున్నారు కబ్జాదారులు. పలు కాలనీలలో పర్మిషన్ లేకుండా బహుళ అంతస్తులు నిర్మాణాలు జరుగుతున్నా అధికారలకు మాత్రం కనిపించడంలేదు. వార్డు కార్యాలయ సమీపంలో కూన మహాలక్ష్మి నగర్‌లో పెద్ద బండ రాయి ఉండేది. అది మెల్లగా చదును చేసి ఆ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ బండరాయిని కొట్టే విషయమై గత సంవత్సరం 'సాక్షి' కథనాన్ని ప్రచురించింది. అయినా అధికారులు స్పందించలేదు. ఇప్పటికైనా అధికారులు ఈ విషయమై చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.


ప్రస్తుతం జరుగుతున్న బహుళ అంతస్తుల నిర్మాణాలు